క్లుప్తంగా

పార్టీ అధినేతతో నాయకులు



ఐరాల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. వైఎస్ జగన్ కలిసిన వారిలో గణేష్‌ప్రసాద్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేషాద్రి, ధనంజయ ఉన్నారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు వారు తెలిపారు.

పని భారం తగ్గించాలని వినతి



రెడ్డిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

తవణంపల్లె: పంచాయతీ కార్యదర్శులకు అధిక పనిభారం, పని ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించాలని కోరుతూ బుధవారం సాయంత్రం ఎంపీడీఓ రెడ్డిబాబుకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు వివిధ రకాల సర్వీసులు, ప్రభుత్వం నిర్దేశిత కార్యక్రమాలు అమలు చేయడంలో సెలవు దినాల్లో విధులు నిర్వర్తిస్తూ ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడితో అనారోగ్యానికి గురై చాలా మంది ప్రాణాలు వదిలేస్తున్నారని వివరించారు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ ప్రవీణ్

గుడిపాల: గర్భిణులకు మెరుగైన వైద్యం అందజేస్తున్నట్లు డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని పేయనపల్లెలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు, ఆశా కార్యకర్తల ద్వారా ఇంటికే వెళ్లి రక్తపరీక్షలు కూడా చేయిస్తున్నామన్నారు. అనంతరం బీపీ, షుగర్, ఇతర సమస్యలతో బాధపడుతున్న 60 మంది రోగులకు చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశారు. మంచానపడ్డ రోగులకు ఇంటి వద్దకు వెళ్లి వైద్యం అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అన్నపూర్ణ, రెజ్వాన, శశి, సుధ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్యం జాగ్రత్త



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: వేసవిలో వృద్ధులు ఆరోగ్యాన్ని జాగ్రత్త చూసుకొని పదిలంగా ఉంచుకోవాలని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్ట జీవులు.. వేతన వెతలు



గుడిపాల మండలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- కూలీలకు మూడు నెలలుగా అందని కూలి డబ్బులు
- ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పులో తలమునకలైన అధికారులు
- కూలీలను పట్టించుకోని వైనం

గుడిపాల: మండలంలోని ఉపాధి కూలీలకు మూడు నెలలుగా కూలి అందకపోవడంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 4,216 జాబ్ కార్డులుండగా 6,461 మందికి పైగా ఉపాధి కూలీలు ఉన్నారు. వీరిలో దాదాపు 2,500 మందికి పైగా కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువైన తరువాత ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అయితే మండలంలో ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాన్ని చేపట్టకపోవడంతో, ఉపాధి పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో మండే ఎండల నేపథ్యంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో 20 శాతం అలవెన్స్, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం అలవెన్స్‌ను గత ప్రభుత్వం అదనంగా కూలీలకు అందజేసేది. వేసవిలో కూలీలకు మజ్జిగను పంపిణీ చేయడంతో పాటు, ఎండల్లో పనిచేసే కూలీలు కాసేపు సేద తీరేందుకు టార్పాలిన్‌లు పంపిణీ చేశారు. ఇవేవీ లేకపోవడంతో ఈ ఏడాది అలవెన్స్ కూడా ప్రకటించకపోవడం, గత మూడు నెలలుగా ఉపాధి కూలీల వేతన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో కూలి డబ్బులు అందక కుటుంబపోషణ భారంగా మారి కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో కూలీలు క్రమంగా ఉపాధి పనులకు స్వస్తి పలుకుతూ ప్రత్యామ్నాయ పనులను వెతుక్కునే పనిలో పడ్డారు. దీంతో 3 వేల మందికి పైగా హాజరుకావాల్సిన ఉపాధి కూలీల సంఖ్య ప్రస్తుతం 855 మందికి పడిపోయింది. ఖరీఫ్, రబీ వ్యవసాయ సీజన్లు ముగిశాక మండలంలో కేవలం బోరు కింద సాగుచేసిన పంటపొలాల్లో మాత్రమే కూలి పనులు చేసుకొనే అవకాశం ఉండడం, ఆ పనులు ఎక్కువ మందికి సరిపోకపోవడంతో దిక్కుతోచని కూలీలు వలసబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలి బకాయిలను విడుదల చేయకపోతే గ్రామాలు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది.

మండలంలోని కూలీల వివరాలు	
పంచాయతీలు	27
రెవెన్యూ గ్రామాలు	32
జాబ్‌కార్డులు	4,216
ఉపాధి కూలీలు	6,461
పెండింగ్ బిల్లులు	రూ.50 లక్షలు

విస్తరణ.. పరిశీలన



నగరంలో తిరుపతి రోడ్డులోని చెక్కర ఫ్యాక్టరీ ఫ్లై-ఓవర్ బ్రిడ్జి నుంచి గిరింపేట వరకు జరగాల్సిన రోడ్డు విసరణ పనులను మునిసిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ పరిశీలించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్రతో కలిసి బుధవారం ఆర్డీ ప్లాన్‌ను మ్యాప్‌లో పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన విస్తరణ పనులు, ఇంకా చేయాల్సిన ప్రణాళికపై అధికారులతో చర్చించారు. రోడ్డు విస్తరణకు సహకరించాలని కమిషనర్ కోరారు.

– చిత్తూరు అర్బన్

న్యూ పవర్.. ట్రాన్స్‌ఫార్మర్



నగరంలోని గిరింపేట సబ్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల బ్రేకర్, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో కొత్తవి ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దాదాపు రూ.60 లక్షలు విలువైన 8 ఎంవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను క్రేన్ సాయంతో బిగించామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌టీ విభాగం ఈఈ వాసుదేవరెడ్డి, డీఈ ప్రసాద్, ఏఈ వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– చిత్తూరు కార్పొరేషన్

శక్తి యాప్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ నాగసౌజన్య

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో కాలేజీలో బుధవారం శక్తి యాప్‌పై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మహేశ్వర్, ఎస్ఐ నాగసౌజన్య విద్యార్థులకు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. మహిళల భద్రతను పెంపొందించడానికి ఈ యాప్ ద్వారా అత్యవసర సేవలు పొందవచ్చన్నారు. సమస్యలు ఎదురైతే నిర్భయంగా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని వారు పేర్కొన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాతీయ వృద్ధుల ఆరోగ్య సంరక్షణ ర్యాలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని తపోవనం ఆశ్రమంలో బుధవారం జాతీయ వయోవృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు ఆరోగ్య సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వారికి చికిత్స చేసి మందులు, మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ గిరి, వైద్యులు పూజిత, ఆశ తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

గుడిపాల: రేషన్ కార్డుదారులందరూ ఆయా డీలర్ల వద్ద ఈ కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ జయంతి తెలిపారు. ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈకేవైసీని డీలర్లు పూర్తి చేయాలని కోరారు. గతంలో ఈకేవైసీని కొంతమంది మాత్రమే చేసుకున్నారని చెప్పారు. రేషన్‌కార్డులో ఉన్న కుటుంబసభ్యులు అందరూ ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈకేవైసీ చేయించుకోని వారందరూ ఆయా రేషన్‌షాపుల వద్దకు వెళ్లి చేయించుకోవాలని కోరారు. ఈకేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వం అమలుచేసే పథకాలు కోల్పోతారని చెప్పారు. రేషన్ బియ్యానికి వచ్చినప్పుడు కార్డుదారులకు ఈకేవైసీపై ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత డీలర్లదేనన్నారు.

మాలల గర్జనను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మాలల జేఏసీ నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిర్వహించనున్న రాయలసీమ మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలని మాలల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాలల సింహగర్జనకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. నాయకులు దుగ్గాని జయరాం మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన తిరుపతిలో మున్సిపల్ మైదానంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళితులు ఐకమత్యం చూసి తట్టుకోలేక మాల మాదిగలను విడగొట్టేందుకు పాలకులు చేసే ప్రయత్నమే ఎస్సీ వర్గీకరణ అని తెలిపారు. తిరుపతిలో జరగనున్న మాలల సింహగర్జనలో పాల్గొని పాలకులకు కనువిప్పు కలిగేలా మాలలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో కేవీ రాఘవులు, నారాయణ, కాణిపాకం ధనలక్ష్మి, మునస్వామి దామోదరం మోక్షజ్ఞేశ్వర రావు, రాబర్ట్, పార్థసారథి, చంగల్ రాయుడు, బుల్లెట్ బాబు, మురళి, శరవణ పాల్గొన్నారు.

టీచర్ల బదిలీల చట్టం ఆమోదం హర్షణీయం



బాలాజి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీల చట్టానికి అసెంబ్లీ ఆమోదం హర్షణీయమని ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అధ్యక్షులు బాలాజి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి కోడ్ రూపొందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ప్రతి వారం రాష్ట్ర నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేశారన్నారు. గుర్తింపు పొందిన సంఘాల నాయకుల అభిప్రాయాలు, సూచనలు తీసుకుని డ్రాఫ్ట్ రూపొందించినట్లు చెప్పారు. చాలా సంవత్సరాల నుంచి బదిలీలు జరిగే సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతూనే ఉంటాయన్నారు. బదిలీలు చేయాలని ప్రతి సారి ఉన్నతాధికారులను వేడుకోవాల్సిన పరిస్థితి ఉండేదని చెప్పారు. రోజుకు ఒక జీవో, పూటకో మెమో, గంటకో క్లారిఫికేషన్ అనే రీతిలో మార్గదర్శకాలు విడుదల చేసి టీచర్లకు ఇబ్బందులు సృష్టించే వారని తెలిపారు. ఇష్టానుసారంగా బదిలీ చేపట్టడం వల్ల టీచర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చేదని చెప్పారు. ఇకపై అలాంటి సమస్యలు లేకుండా ఉండేందుకు శాశ్వత బదిలీల కోడ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు అమలు చేయడం ఆనందకరమన్నారు.

విద్యుత్ సమస్యలపై మూడు వినతులు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వినియోగదారులు సమస్యలను తెలియజేశారు. మొత్తం 3 ఫిర్యాదులు వచ్చాయని డీఈ ప్రసాద్ తెలిపారు. అందులో సంతపేట సెక్షన్ పరిధిలో మీటర్‌కు అనుసంధానం చేసిన ఫోన్ నెంబర్‌ను మార్పు చేయాలని వినియోగదారుడు ఫిర్యాదు చేశారు. కొత్త సర్వీసు విడుదలపై చిత్తూరు రూరలఖ సెక్షన్ నుంచి సమస్యను తెలిపారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై మరో వినియోగదారుడు తెలుసుకొని పైకం చెల్లించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఈ మాధురి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న డీఈ ప్రసాద్

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



గాజులపల్లెలో వైద్య సిబ్బందికి సూచలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

తవణంపల్లె: గ్రామాలకు వెళ్లి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి బి.వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని గాజులపల్లెలో బుధవారం వీధులను, పరిసరాలను పరిశీలించారు. ఆయనతోపాటు జిల్లా అదనపు మలేరియా అధికారి ఎస్.రామకృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు నారాయణ సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరపీడితులు ఉన్నారా లేదా అని ఆరా తీశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డెంగీ జ్వరం, ఫైలేరియా, చికున్‌గున్యా జ్వరాల గురించి వివరించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ మౌని, ఆశాకార్యకర్తలు భారతి, వనజ పాల్గొన్నారు.

విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలి



అరగొండలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

తవణంపల్లె: విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని ఎంఈఓ హేమలత తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, అరగొండ బాలుర హైస్కూల్లోని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు రెండోరోజు పరీక్షలు నిర్వహించారు. అరగొండ బాలుర హైస్కూల్లో ఎంఈఓ హేమలత ఆధ్వర్యంలో విద్యార్థులు హాల్‌టికెట్లను పరిశీలించి పరీక్ష కేంద్రానికి అనుమతిచ్చారు. తవణంపల్లె, అరగొండ పరీక్ష కేంద్రాలను ఎస్ఐ చిరంజీవి తనిఖీ చేశారు. అరగొండ బాలుర హైస్కూల్ పరీక్ష కేంద్రానికి ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో 166 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థులు గదిలో ఉండగా పరీక్ష సమయంలో పరిశీలకులు అనేక సార్లు తిరగడంతో విద్యార్థులు భయాందోళనకు గురై పరీక్షలు సక్రమంగా రాయడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వడదెబ్బతో తస్మాత్ జాగ్రత్త



వేసవిలో చేయకూడనివి

- మధ్యాహ్న సమయంలోని మండుటెండల్లో ఎక్కువగా తిరగరాదు.
- మద్యం సేవించరాదు.
- రోడ్డు మీద విక్రయించే చల్లని రంగు పానీయాలు (కూల్ డ్రింక్స్) తాగరాదు
- ఈగలు, దుమ్ము, ధూళి పడిన, కలుషితమైన ఆహారం తినకూడదు
- వేసవిలో మాంసాహారం తినకపోవడం ఉత్తమం.
- నూనెలో వేసిన ఆహారపదార్థాలు తినకూడదు.
- భోజనం అతిగా తినకూడదు.
- ఇంటి పరిసరాల్లో చెత్త నిల్వ ఉంచుకోకూడదు.

వేసవిలో చేయవలసిన పనులు

- నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ ఎక్కువ తీసుకోవాలి.
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి.
- పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి.
- రోజూ రెండు పూటలా స్నానం చేయాలి.
- భోజనం మితంగా చేయాలి.
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి.
- నిదురించే సమయంలో దోమతెరలు వాడాలి.
- బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి.
- చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి.
- తాజా కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి.

ఐరాల: మండే ఎండల నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం మండలంలో 36 నుంచి 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్ (శరీరంలో నీటి శాతం తగ్గడం), డయేరియా(విరేచనాలు), వడదెబ్బ తదితర సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. వడదెబ్బకు ప్రాథమికంగా నీరే ప్రాణాధారం, సాధ్యమైనంతవరకు కొబ్బరి నీరు తీసుకోవాలని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు.

ఎండలో పనిచేస్తే..

ప్రజలు వేసవి కాలంలో వీలైనంతగా పని చేయకుండా ఉండడం మంచిది. ఉదయం, సాయంత్రం మాత్రమే ప్రజలు పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువ సేపు పనిచేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, ఒళ్లు నొప్పులు వస్తాయి. ఒక్కోసారి అపస్మారక స్థితిలో వెళ్లే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో వడదెబ్బకు గురైన బాధితులను శీతల ప్రాంతంలో ఉంచి చల్లని గాలి తగిలేలా చూడాలి. శరీరాన్ని తడి గుడ్డతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గని పక్షంలో సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించాలి.

వడదెబ్బకు ప్రథమ చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి.
- ఐస్ నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం బాగా తుడవాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి. లేనిపక్షంలో గ్లూకోజు, ద్రావణం త్రాగించాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పనికి వెళ్లిన మహిళ అదృశ్యంపై బుధవారం తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. తాలూకా ఎస్ఐ మల్లికార్జున వివరాల మేరకు చిత్తూరు మండలం చెర్లోపల్లి పంచాయతీ ఏనుగుంట్ల పల్లెకు చెందిన వివాహిత పెళ్లి మండపాల్లో పనిచేస్తోంది. ఈనెల 15న ఓ కల్యాణ మండపంలో పనికి వెళ్లింది. ఆ రాత్రి ఇంటికి రాకపోయే సరికి కుటుంబీకులు ఆమె కోసం గాలించారు. చివరకు ఆచూకీ లేకపోవడంతో భర్త తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.